విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 21 మార్చి 2024 8 పేజీలు

దర్శిపై వీడని 'ఉత్కంఠ'

- టీడీపీ నుంచి శిద్ధా, మద్దిశెట్టి పేర్లు
- ఇప్పటికే వైసీపీ నుంచి దూకుడు పెంచిన బూచేపల్లి
- టీడీపీ అభ్యర్థి ఖరారు కాకపోవడంతో అయోమయంలో క్యాడర్
- నేడో రేపో అభ్యర్థిని ఖరారు చేసే ఆలోచనలో టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ దర్శి నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరన్నదానిపై ఉత్కంఠ వీడలేదు. రోజుకో కొత్తపేర్లు తెరమీదకు వస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు గోరంట్ల రవికుమార్, గరికపాటి వెంకట్, శ్రీలక్ష్మి పేర్లు వినిపించగా తాజాగా వైసీపీకి చెందిన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తెరమీదకు వచ్చింది. గత కొన్ని రోజులుగా మళ్లీ దర్శి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున శిద్ధా రాఘవరావు పోటీ చేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మొత్తం మీద టీడీపీకి కూడా దర్శి నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక తలనొప్పిగా మారింది. ఇప్పటికే జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాలకు ఆ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేగా పోటీచేసే అభ్యర్థులను ప్రకటించింది. వారు ఇప్పటికే ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. మరోపక్క వైసీపీ దర్శి నుంచి పోటీకి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని రంగంలోకి దించింది. గత మాసం నుంచి శివప్రసాద్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే మండలాల్లోని మేజర్ పంచాయితీల్లో ఒక దఫా ప్రచారాన్ని కూడా ముగించారు. మరోపక్క తెలుగుదేశం పార్టీలో ఉన్న అసమ్మతి వాదులను కూడా వైసీపీలోకి చేర్చుకుంటూ తన బలాన్ని పెంచుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రం ఇంకా అభ్యర్థి ఎంపికలోనే కొట్టుమిట్టాడుతుంది. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున కదిరిబాబురావు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. కొద్ది రోజుల తరువాత కదిరి బాబురావు తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరారు. తదనంతరం దర్శి టీడీపీ ఇన్‌ఛార్జిగా పమిడి రమేష్‌ను నియమించింది. రమేష్ కొంతకాలం నియోజకవర్గంలో యాక్టివ్‌గా పనిచేశారు. గత రెండేళ్ల క్రితం జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులను గెలిపించుకొని మునిసిపాలిటీని కైవసం చేసుకున్నారు. తదనంతరం వివిధ కారణాలతో పమిడి రమేష్ తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు. అక్కడి నుంచి టీడీపీ ఇన్‌చార్జిగా సరైన నాయకులు లేకపోవడం, ఆ పార్టీకి లోటుగానే మారింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ, జనసేన పొత్తు ఖరారైంది. దీంతో దర్శి నియోజకవర్గాన్ని జనసేన పార్టీకి కేటాయిస్తారని ప్రచారం జరిగింది. దీంతో జనసేనపార్టీ తరపున గరికపాటి వెంకట్‌ను ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దించింది. కొంతకాలం వెంకట్ నియోజకవర్గంలో పర్యటిస్తూ కొన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ పార్టీ కార్యక్రమాలను విస్తరింపచేశారు. ఇక దర్శి నియోజకవర్గం నుంచి జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థిగా వెంకట్‌కే టిక్కెట్ ఇస్తారని అందరూ భావించారు. ఇటీవల కాలంలో మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో టీడీపీ, జనసేన కూటమితో పాటు బీజేపీ కూడా కూటమిలో భాగస్వామ్యం అయ్యింది. దీంతో సీట్ల సర్దుబాటులో జనసేనకు కొన్ని సీట్లు తగ్గాయి. మళ్లీ దర్శి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థినే రంగంలోకి దించనున్నట్లు సీట్లు సర్దుబాటులో నిర్ణయం

మిగతా 2లో ...

గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న అధికారులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలంలోని గంగుపల్లి గ్రామంలో కేసనపల్లి బ్రహ్మయ్య తన పొలంలో కంది మొక్కల చాటున పెంచుతున్న గంజాయి మొక్కలను సెబ్ స్టేషన్ సీఐ నాగేశ్వరరావు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం మండలంలోని గంగుపల్లి గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న సర్వే నెంబర్ 359/2లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో కందిచేను మధ్యలో అక్కడక్కడ నాటబడిన గంజాయి మొక్కలను గుర్తించి ప్రతి మొక్కను మధ్యవర్తుల సమక్షంలో పెకిలించి మొత్తం 282 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొక్కలను గంగుపల్లి గ్రామ నివాసి అయిన కేసనపల్లి బ్రహ్మయ్య వ్యవసాయంలో వచ్చిన ఆర్థిక నష్టాలు, అప్పుల బాధ నుండి బయటపడుటకు గంజాయి సాగు చేసి అధిక లాభం పొందవచ్చునని సాధువుల వద్ద నుండి గంజాయి విత్తనాలు కొనుగోలు చేసి వాటిని తన పొలంలో నాటి జాగ్రత్తగా నీరు, యూరియా, పోషకాలతో శ్రద్ధగా పెంచుతున్నట్లు తెలిపారు. సదరు మొక్కలు సుమారు రెండు అడుగుల పొడవు నుండి ఆరడుగుల వరకు పెరిగి ఉన్నాయి. సదరు గంజాయి మొక్కల విలువ రూ.3 లక్షల వరకు ఉండొచ్చని

మిగతా 2లో ...

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ బాపట్ల పట్టణంలోని 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న బాపట్ల మున్సిపల్ హైస్కూల్ని, బాలికల ఉన్నత పాఠశాలను, లిటిల్ ఏంజెల్స్ హై స్కూల్‌ను ప్రత్యక్షంగా సందర్శించి పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 108 సెంటర్లలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరగడానికి ప్రతి సెంటర్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామని ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే వారు ఆ పరీక్ష కేంద్రానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష పేపర్లు స్టేషన్ నుండి బయలుదేరి పరీక్ష కేంద్రాల

మిగతా 2లో ...

ఫారం-6 దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తాం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఫారం-6 దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై ఎలాంటి దరఖాస్తుల స్వీకరించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన యువతి యువకులకు ఓటు హక్కు కల్పించడానికి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలలో రాజకీయ పార్టీల ప్రచారం ఉండరాదని స్పష్టం చేశారు. హోర్డింగ్, ప్రచార బోర్డులు, గోడపత్రాల ద్వారా ప్రచారం చేయరాదని ఆయన తెలిపారు. మునిసిపాలిటీల లోని హోర్డింగ్‌ల ద్వారా రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతులు లేవన్నారు. కేవలం జాతీయ రహదారుల వెంట హోర్డింగ్‌లతో ప్రచారం చేసుకోవచ్చున్నారు. ఆర్.ఓలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా అనుమతులు ఇస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకువెళ్లరాదని స్పష్టం చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. పార్లమెంట్,శాసనసభ ఎన్నికల కొరకు ఓటర్ల జాబితా సిద్ధమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు.గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి నేటి వరకు ఓటర్ల జాబితా సవరణ కొరకు 2,22,48 దరఖాస్తులు వచ్చాయన్నారు. 1,82,400 దరఖాస్తులను ఇప్పటివరకు పరిష్కరించామన్నారు. 36,555 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 3,453 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మే నెలలో జరగనున్న ఎన్నికలకు యంత్రాంగం సంసిద్ధమవుతోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, బిజెపి నాయకులు కె.వి రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.రవి, బీఎస్పీ నాయకులు కాగిత కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు ఎన్ కోటేశ్వరావు, వైసీపీ నాయకులు ఐ.మాల్యాద్రి, టీడీపీ నాయకులు షేక్ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

రాజమార్గంలో పనులు దొడ్డిదారిన వసూళ్లు

- ప్రతి పనికి రేటు
- సొమ్ము వసూళ్లకు ప్రైవేట్ వ్యక్తులు
- రవాణా శాఖ కార్యాలయం లీలలు

4 లో..

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముళ్ళమూరులో ఎస్ఐ ఆంజనేయులు బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువలన అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా వాహనాలు తనిఖీ చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలు ప్రయాణ సమయంలో మీ దగ్గర ఉన్న వస్తువులకు, నగదుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని అన్నారు. లేనిచో స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి అంకారావు, కానిస్టేబుల్ దాసరి ఏసుబాబు, కాశి రాజు తదితరులు పాల్గొన్నారు.

దర్శిపై వీడని 'ఉత్కంఠ'

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నుంచి రంగంలోకి ఎవరిని దించాలన్నదానిపై గత కొన్ని రోజులుగా ఆ పార్టీ అధిష్టానం తర్జన భర్జన పడుతుంది. వైసీపీ నుంచి ఆర్థికంగా బలమైన వ్యక్తి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రంగంలో ఉన్నారు. బూచేపల్లిని ఎదుర్కొనే సత్తా ఉన్న నాయకుల్లో ఒకరుగా ఉన్న శిద్ధా రాఘవరావుకు మరోసారి తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం కల్పించేందుకు తెలుగుదేశం సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే శిద్ధా రాఘవరావు పోటీకి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తుంది. ఎన్నికల షెడ్యూల్ కూడా ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో దర్శి అభ్యర్థి ఎంపిక ఆలస్యం చేయడం మంచిది కాదని భావించిన తెలుగుదేశం మరో అభ్యర్థిపై దృష్టి సారించింది. ఈ క్రమంలో వైసీపీకి చెందిన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రస్తుతం వైసీపీకి దూరంగా ఉంటున్నారు. తనను కాదని వైసీపీ ఎమ్మెల్యే టిక్కెట్టు బూచేపల్లికి కేటాయించడంతో తీవ్ర అసంతృప్తిగా ఉన్న మద్దిశెట్టి టీడీపీలో చేరి దర్శి నుంచి పోటీకి సిద్ధమైనట్లు తెలుస్తుంది. దీంతో తెలుగుదేశం కూడా శిద్ధా కాదంటే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతుంది.

పటిష్ట బందోబస్తు

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు చేరేవరకు, జవాబు పత్రాలు పరీక్ష కేంద్రాల నుండి పోస్ట్ ఆఫీస్‌కు చేరేవరకు కావలసిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది వారి మొబైల్ ఫోన్‌లను పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకు రాకూడదని,మొబైల్ ఫోన్‌లను పరీక్షా సమయానికి ముందుగానే భద్రంగా డిపాజిట్ చేయించాల్సిన బాధ్యత చీఫ్ ఇన్విజిలేటర్లదేనని సూచించారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మురళీకృష్ణ, ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జునరావు,పట్టణ సిఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్కు పంపారు. రాబోయే ఎన్నికలలో మద్యం పంపిణీ చేసినా, అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై మోహన్, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని అడిషనల్ ఎస్పి టి.పి. విఠలేశ్వర్ అన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పి టి.పి. విఠలేశ్వర్ బుధవారం బాపట్ల సబ్ జైల్‌ను, బాపట్ల పట్టణ,గ్రామీణ పోలీస్ స్టేషన్లను,బాపట్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని, ఆర్మ్డు రిజర్వ్ కార్యాలయాన్ని,ఎమ్.టి కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ పరిసరాలను,సిబ్బంది పనితీరును పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ మట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పోలీస్ శాఖ విధులు చాలా కీలకమైనవని,పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఎవరి విధులు వారు బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు.సి-విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ముఖ్యమన్నారు. సరిహద్దులలోని చెక్ పోస్టల వద్ద ప్రతిఒక్క

వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు.

అశోక్ రెడ్డి కృషితోనే గ్రామాల్లో అభివృద్ధి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బసినేపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపి జనసేనల ఉమ్మడి మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. నాడు తెలుగుదేశం హయాంలో ముత్తుముల అశోక్ రెడ్డి కృషితో గ్రామాల్లో త్రాగునీటి సమస్యకు పరిష్కారం చూపారని, సిమెంట్ రోడ్లు వేశారని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేశారని గుర్తుచేశారు. గిద్దలూరులో స్థానికంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు అశోక్ రెడ్డి అని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా మీ ముందుంటారని, రాబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ టీడీపి జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసే అశోక్ రెడ్డికి సైకిల్ గుర్తు పై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సొరెడ్డి మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుంటిక నరసింహ యాదవ్ , మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, దుంపల రమణారెడ్డి, పోతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, జయరాం రెడ్డి, కాశయ్య, పూజల శ్రీనివాస్ యాదవ్, స్థానిక టీడీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికల సిబ్బంది, ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమాలను కచ్చితంగా పాటించాలని తహశీల్దార్, ఏఆర్ఓ బి.పద్మావతి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, వాలంటీర్లు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, నిబంధనలు అతిక్రమించి ఎవరైనా పాల్గొంటే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి సందర్భంగా గ్రామాలలోఎక్కడైనా మంచినీటి సమస్య ఏర్పడి, బోరు వేయాల్సి వస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల పర్యటనలో మంత్రులకు ప్రభుత్వవసతి గృహాలను కేటాయించరాదని చెప్పారు. ఫంక్షన్ల వంటి ప్రైవేటు కార్యక్రమాల్లో రాజకీయ నాయకుల ఫోటోలు వాడరాదన్నారు. జీవిత భాగస్వామి రాజకీయ రంగంలో చురుకుగా ఉన్న అధికారులందరూ ఎన్నికలుపూర్తయ్యే వరకు పై అధికారుల అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్ళరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలని, వారు ఎలాంటి ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని తెలిపారు. మీడియా మిత్రులు, రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బంది, ప్రజలు ఎన్నికల నియమాలను అనుసరించి సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ టి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

463 మంది విద్యార్థులు హాజరు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులో బుధవారం మూడవరోజు పదో తరగతి పరీక్షలకు 463 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆదర్శ పాఠశాల డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ సురభి ఆదామ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 212మందికి గాను 210 మంది, ఆదర్శ పాఠశాలలో 264 మందికి గాను 253 మంది హాజరైనారు.11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను డీఈవో సుభద్ర, ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బి నాగేంద్ర వదన పరీక్షలను తనిఖీ చేశారు.

భైరవకోనను సందర్శించిన ఎన్.శర్మ, సంజీవరావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన, పర్యాటక కేంద్రమైన భైరవకోన దేవస్థానంను విజయవాడ విద్యుత్‌శాఖ ఏపీ ఈఈయు 1104 డిస్కం ప్రెసిడెంట్ ఎన్.శర్మ, సెక్రటరీ ఆర్ సంజీవరావు బుధవారం సందర్శించారు.

ముందుగా వీరు భైరవకోనలోని వాటర్‌పాల్స్‌ను సందర్శించి అనంతరం త్రిముఖ దుర్గాంబ కాళభైరవ శివలింగాలను దర్శించి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భైరవకోన దేవస్థానం ఈఓ నర్రా నారాయణరెడ్డి, చైర్మన్ సిద్ధు రమణారెడ్డి సూచనల మేరకు ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారికి పూలమాల వేసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు విద్యుత్ ఉద్యోగులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో క్విస్ విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-ఒంగోలు: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో క్విస్ కళాశాల విద్యార్థిని భార్గవి ద్వితీయ స్థానంలో సిల్వర్ పతకం సాధించింది. మార్చి 3 నుండి 9 వరకు ఢిల్లీలో గల విరాట్‌లో స్వామి వివేకానంద శుభ భారతి యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పోటీల్లో నిర్వహించారు. ఈ పోటల్లో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఒంగోలు విద్యార్థిని భార్గవి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది ఈ పోటీల్లో అద్భుత ప్రతిభను చూపింది. ఈ సందర్భంగా క్విస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ చైర్మన్ డాక్టర్ నిడమానూరు సూర్య కళ్యాణ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, హెచ్ ఓ డి డాక్టర్ మౌళి చంద్ర,కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ భార్గవికి అభినందనలు తెలియజేశారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం నందు 50వ డివిజన్ (జయప్రకాశ్ కాలనీ) కి చెందిన వైసీపీ నాయకులు తుపాకుల శ్రీనివాసులు, బెల్లంకొండ రవి, వలసాని శ్రీనివాసులు, కేశనబోయిన రవణయ్య,మలసాని తిరపతయ్యకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. 50 మందికి జనార్ధన్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, బొల్లినేని వాసు, కమ్మ వెంకటేశ్వర్లు,చింతపల్లి రాంబాబు, కాంద్ర మల్లికార్జున,డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

27న 'ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలు'

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకల వివరాల కరపత్రికను బుధవారం ఉదయం సివిఎన్ రీడింగ్ రూమ్ ఆవరణ నందు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సకల కళల సమాహారం' నాటకం అని, అటువంటి నాటక రంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, నేటి సాంకేతిక యుగంలో పౌరాణిక నాటకరంగం బలోపేతానికి శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కసుమాల రాఘవులు మాట్లాడుతూ 27వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు తమ సంస్థ ఆధ్వర్యంలో సి వి యన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ కళా ప్రాంగణంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని తెలిపారు.ముందుగా చందు డాన్స్ అకాడమీ వారిచే నృత్య ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఆగమ వేద పండితులు పరాంకుశం కేశవాచార్యులు, ఆత్మీయ అతిథులుగా నరసం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, నాగభైరవ సాహితీ పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ కోటేశ్వర రావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ప్రరసం అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు హాజరుకానున్నారని వారు తెలిపారు.ఈ కరపత్ర ఆవిష్కరణ లో లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు అసోసియేషన్ ప్రతినిధులు చిటితోటి బాబురావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సింగయ్య గుంటూరు సత్యనారాయణ, ఆదిపూడి సరేంద్ర, గోదాసు సుబ్బారావు, పిల్లి నాగభూషణం పాల్గొన్నారు.

రాజకీయ ప్రచారం చేస్తున్న

వాలంటీర్లను తొలగించాలి

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రం లో ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వచ్ఛంగా జరగాలంటే రాజకీయ ప్రచారం చేస్తున్న, అధికార పార్టీ ప్రచార కార్యక్రమాలలో భాగస్వాములు అవుతున్న వాలంటీర్లను వెంటనే తొలగించాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన ఒంగోలులోని రంగభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి తో పాటు సుపరిపాలన వేదిక నేత రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సుంకర సాయి బాబు,ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ అధ్యక్షులు కొల్లా మధు, సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షులు,రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కంచర్ల సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె .ఆల్ఫ్రెడ్ , కర్నూల్ రోడ్డు షాప్ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మారెళ్ళ సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ వేతనంతో పనిచేస్తున్న వాలంటీర్లు ఎన్నికల విధులలో భాగస్వాములు కాకూడదని కేంద్ర ఎన్నికల కమిషన్, హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఐపీసీ సెక్షన్ 171, 123 ప్రకారం నేరంగా పరిగణించి అలాంటి వాలంటీర్లను తొలగించాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ 15 మంది నిజాయితీ పరులైన మేధావులు, రిటైర్డ్ అధికారులతో ఏర్పడి ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అర్హత ఉండి ఓటర్ల జాబితాలో ఓట్లు లేని వారు ఏప్రిల్ 15వ తేదీ లోపు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకొని ఓటు పొందవచ్చునని తెలిపారు. ఎన్నికల అక్రమాలపై స్పందించడానికి సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004250264, వాట్సాప్ నెంబర్ 879000557 ను వినియోగించుకోవాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన సి విజిల్ యాప్ ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావులు మౌనం వీడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తోడ్పడాలని కోరారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సుంకర సాయిబాబు ప్రసంగిస్తూ రాజకీయ పార్టీలు హింస పూరిత చర్యలకు చరమగీతం పాడాలని కోరారు. ఇటీవల గిద్దలూరులో పి.మున్నయ్య అనే వ్యక్తిని ప్రజాగలం సభకు జనాన్ని తీసుకుని వెళ్లారనే కారణంతో అధికార పార్టీ వాళ్లు దారుణంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షులు కంచర్ల సుబ్బారావు ప్రసంగిస్తూ కులం,మతం,నగదు,మద్యం లాంటి ప్రలోభాలకు లోను కాకుండా సుపరిపాలనను అందించే నేతలను ఎన్నుకోవాలని కోరారు.

మాదిగల మేలుపై

బహిరంగ చర్చకు మందకృష్ణ సిద్ధమా?

- వైసీపీ ప్రభుత్వంలోనే మాదిగలకు న్యాయం
- మాదిగ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ కనకారావు సవాల్

విశాలాంధ్ర-ఒంగోలు: వైసీపీ ప్రభుత్వంలో మాదిగలకు జరిగిన మేలు గురించి మేము బహిరంగ చర్చకు సిద్ధం, టీడీపీ ప్రభుత్వం లో మాదిగలకు జరిగిన మేలు గురించి నీవు చర్చకు సిద్ధమా అని మందకృష్ణ కు మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ సవాల్ విసిరారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు పెద్ద మాదిగ ను అవుతాననీ మాటలు చెప్పి మోసం చేసిన తీరు మర్చిపోక ముందే మరోసారి టీడీపీ కూటమికి మాదిగలు మద్దత్తు ఇవ్వాలని మందకృష్ణ పిలుపు ఇవ్వడం కేవలం ఎన్నికల్లో డబ్బులకోసమే తప్ప మాదిగల సంక్షేమం కోసం కాదని, మాదిగలు గ్రహించి మరోసారి మోసపోవద్దన్నారు. ఎన్నికల వచ్చిన ప్రతిసారీ వర్గీకరణ సెంటిమెంట్ మాదిగలు మీద రుద్ది ఎన్నికల్లో టీడీపీకి అమ్ముడు పోవడం మందకృష్ణకు పరిపాటిగా మారిందని, వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీకి కర్నాటక లో, తెలంగాణలో మందకృష్ణ మద్దతు ఇచ్చినా మాదిగలు నమ్మ లేదని, ఎన్నికలప్పుడు టీడీపీ కూటమికి మద్దతు చేయడం ఎన్నికల అనంతరం అధికారంలో ఉన్న పార్టీ మాదిగలను దూరం చేయడం తోనే మాదిగలు రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ అన్యాయానికి గురౌతున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత మాదిగలు పెద్దపీట వేశారని ఈవిషయంలో ఎలాంటి చర్చకైనా మేము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. దాదాపు 75వేల చర్మకార కుటుంబాలకు చర్మకారులకు, డప్పు కళాకారులకు నెల నెలా పింఛన్లు ఇస్తున్న విషయం, నామినేటె పోస్టులు విషయంలో పెద్ద పీట వేస్తున్న విషయం మందకృష్ణకి గుర్తుకు రాకపోవడం బాధాకరమన్నారు. స్వార్ధ రాజకీయాలకు మాదిగలు బలికావద్దని కనకారావు పిలుపుఇచ్చారు.

500 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేశామని నగరం సెబ్ సీఐ అర్.యు.వి. ఎస్. ప్రసాద్ తెలిపారు.బుధవారం అయన మాట్లాడుతూ నగరం సెబ్ స్టేషన్ పరిధిలోని నిజాంపట్నం మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని అదవలగ్రామం పడమర దిక్కున ఉన్న మడ అడవుల ప్రాంతంలో దాదులు నిర్వహించి సుమారు 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు.నగరం సెబ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారు చేసిన,అమ్మకాలు జరిపిన వారి పై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడిలో సబ్ ఎస్సై ఏ.శేషమ్మ, సెబ్ సిబ్బంది సుందరయ్య, శివప్రసాద్,గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు

పాటించకపోతే చర్యలు తప్పవు

- రిటర్నింగ్ అధికారి జాన్ ఇర్విన్

విశాలాంధ్ర-కనిగిరి : ఎన్నికల్లో పోటీ చేస్తే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని కనిగిరి రిటర్నింగ్ అధికారి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. బుధవారం కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో రాజకీయ ప్రచారం చేయాలంటే ప్రచార రథాలు, వాహనాలు, ఎంతమంది కార్యకర్తలు ప్రచారంలో పాల్గొంటారని 48 గంటల ముందే అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించే రూట్ మ్యాప్ అందజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరగాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ అభ్యర్థి ముక్కు ఉగ్ర నర్సింహారెడ్డి ,మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్, పి డి సి సి బ్యాంక్ చైర్మన్ వై యం ప్రసాద్ రెడ్డి , సీపీఎం నాయకులు చూసి కేశవరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నారా లోకేష్ కాన్వాయ్ తనిఖీ

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కాన్వాయ్‌ను ఉండవల్లి కరకట్ట వద్ద పోలీసులు ఆపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నామని చెప్పడంతో ఆయన సహకరించారు. కాన్వాయ్‌లోని కార్లు అన్నింటినీ పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఏమీలేదని పోలీసులు నిర్ధారించిన తర్వాత కాన్వాయ్‌ను పంపించారు. అపార్ట్‌మెంట్ వాసు లతో ముఖాముఖి కార్యక్రమానికి వెళ్తుండగా ఈ తనిఖీలు జరిగాయి.

వలస బాటన - మూగజీవాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : వర్షాలు లేకపోవడంతో కరువు పరిస్థితులు కమ్ముకుంటున్నాయి. సక్రమంగా వర్షాలు పడక, సాగర్ జలాలు లేక పంటలు పండక ఒకవైపు పచ్చి గడ్డి ఎండు గడ్డి లేక, పాడి లేక తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. వేసవిలో త్రాగేందుకు చుక్క నీరు లేక మేత లేకపోవడంతో జిల్లాలోని పుల్లల చెరువు మండలం నుండి ఆవులు మందలు పొరుగు జిల్లాలకు వలస వెళుతున్నాయి. బుధవారం ముండ్ల మూరు నుంచి సుమారు 6 మందలలో నాలుగు వేల ఆవులు మేత కోసం కృష్ణాజిల్లా రేపల్లెకు తోలుకెళుతూ విశాలాంధ్రకు కనిపించారు. దాహార్తితో ముండ్లమూరు చిలక లేరు వాగులో నీళ్లు తాగుతూ ముందుకు సాగాయి. వాటితోపాటు ఎద్ల బండిలో నడవలేని లేగ దూడలను వేసుకుంటూ, కుటుంబ అవసరాలకు తిండి గింజలు బండిలో వేసుకొని వెళుతూ ఉన్నారు.

బొల్లా లక్ష్మీదేవికి నివాళులర్పించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని లక్ష్మీనరసాపురం పంచాయతీ పరిధిలోని పుట్టంనాయుని పల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసి స్వర్గీయ బొల్లా మాల్యాద్రి చౌదరి మాతృమూర్తి లక్ష్మీదేవి ఇటీవల మృతి చెందినది. ఆమె దశదిన కార్యక్రమం పుట్టంనాయునిపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. మండల టీడీపీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహ రావు, ఇర్రి కోటి రెడ్డి, సయ్యద్ అమీర్ బాబు, పువ్వాడి వెంకటేశ్వర్లు (బెంగ ళూరు), దేవరపు మాల్యాద్రి, గల్లా చెన్నయ్య, పాలపర్తి వెంకటేశ్వర్లు, గోళ్ళ వెంకటేశ్వర్లు, బత్తుల సత్య నారాయణ, ఇర్రి శ్రీనివాసుల రెడ్డి, గుత్తి మహేష్, మండ్ల మల్లిఖార్జున రావు, మండ్ల రమణయ్య, పోలేపల్లి హరి, అబ్బారెడ్డి రాజా, టీడీపీ శ్రేణులు పాల్గొని లక్ష్మీదేవి చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులర్పించారు.

టీడీపీలోకి శీలం రోజన్ బాబు

విశాలాంధ్ర - బాపట్ల : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల దళిత బహుజన ఉద్యమ నేత శీలం రోజన్‌బాబు తన అనుచరులతో నియోజకవర్గ టీడీపీ, జనసేన,బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదుగా బుధవారం పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలోకి చేరారు.. పార్టీలోకి చేరిన వారిలో శీలం రోజన్ బాబు, దుడ్డు ప్రసన్న బాబు, మాటూరి ఆనంద్ బాబు,తగరపు రవి కుమార్, మార్పు దీన రాజు, గోళ్ళపూడి కిరణ్ కుమార్, షేక్ రహీమ్, మంచాల ఆనంద్, గుమ్మడి కళ్యాణ్, బెజ్జం ఆనంద్, శీలం వంశీకృష్ణ, ఆర్య నవీన్ కుమార్, బిటి రమేష్, పి.క్రిష్టాఫర్, చల్ల సంసోను, కరసాల బాబు, కరసాల పవన్, చల్ల శ్యాం పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో గోలపల శ్రీను, మందపాటి ఆంధ్రయ్య, ముప్పిరి రాజశేఖర్‌బాబు, దాసరి యోహాను, పసుమర్తి యలమంత సలగల సురేష్ పాల్గొన్నారు.

రాజమార్గంలో పనులు...దొడ్డిదారిన వసూళ్లు

- ప్రతి పనికి రేటు నిర్ణయం
- సొమ్ము వసూళ్లకు ప్రైవేట్ వ్యక్తులు
- రవాణా శాఖ కార్యాలయం లీలలు

విశాలాంధ్ర-ఒంగోలు : రవాణా శాఖ కార్యాలయంలో పనులు మాత్రం రాజమార్గంలో నడు స్తాయి అందుకు సంబంధించిన సొమ్ము వసూళ్లు దొడ్డి దారులు నడుస్తాయి. ఒంగోలు రవాణా శాఖ కార్యాలయంలో ఏ పని ఉన్న పనిని బట్టి రేటు నిర్ణయించ బడి ఉంటుంది. బయట నుండి ఏజెంట్లు కోడ్ వేసి కార్యాలయానికి పంపించడం జరుగు తుంది. దాని ప్రకారం అక్కడ అధికారులు సిబ్బంది సంబంధిత పని పూర్తి చేస్తారు. ఆ పనికి సంబంధించిన రేటు సొమ్మును సాయంత్రానికి దొడ్డి దారిన వసూలు చేస్తారు. అందులో కార్యాలయంలో పనులు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన ఫిట్నెస్ సర్టిఫికెట్లు, ఎల్ ఎల్ ఆర్ లు వీటికి ఒక్కదానికి ఒక్కొక్క రేటు లంచం నిర్ణయించి ఉంటుంది. ఏ పనికి ఎంత అనేది ఏజెంట్లకు తెలిసి ఉంటుంది దాని ప్రకారం ఏజెంట్లు కోడ్ వేసి కార్యాలయాన్ని పంపడం జరుగు తుంది. దాని ప్రకారం సంబంధిత అధికారి ఆ పని పూర్తి చేస్తారు. ఏ పని ఉన్నప్పటికీ దాని సంబంధించిన అన్ని ద్రవపత్రాలు సక్రమంగా ఉంటేనే పనిచేయడం జరుగుతుంది.

సొమ్ము వసూళ్లకు ప్రైవేట్ వ్యక్తులు : అవినీతి సొమ్మును వసూలు చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారు. పనులు పూర్తయిన తర్వాత ఆ వ్యక్తులు సాయంత్రానికి ఎవరెవరు ఏ పనికి కోడ్ వేసి పంపారు చూసుకుంటారు, దాని ప్రకారం సాయంత్రానికి సంబంధిత వ్యక్తుల దగ్గరికి వెళ్లి ఆ సొమ్మును వసూలు చేస్తారు. అది వసూలు చేసినందుకు వారు అదనంగా కొంత వసూలు చేస్తారు. సాయంత్రం వసూలు చేసిన సొమ్మును రాత్రికి సంబంధిత అధి కారులకు అందజేయడం జరుగుతుంది. ఇదేవిధంగా పనులు జరుగుతుంటాయని వాహనదారులు వా పోతున్నారు. వారు వసూలు చేసే సొమ్ము కూడా కొన్ని వేల రూపాయలు ఉంటుందని అంచనా. దీని ప్రకారం నెలకు లక్షల్లో వారికి అవినీతి సొమ్ము ముట్టుతోందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించవలసిన అవసరం ఉందని ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు అంటున్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపాలి

ఎస్పీ పి. పరమేశ్వర్‌రెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అక్రమ మద్యం ,గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా అమ్మకాలపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయం ముందు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఎంసిసి పట్ల పూర్తి అవగాహన కలిగి ఎన్నికల నియమావళి కి కట్టుబడి విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో నాటు సారా మాదకద్రవ్యాల విక్రయాలకు సంబంధించి నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. మద్యం గంజాయి అక్రమ నిల్వలను గుర్తించి ఆకస్మిక దాడులు జరిపి సీజ్ చేయాలని ఆదేశించారు. మద్యం స్టాక్ పాయింట్లు రెస్టారెంట్లు తరచూ తనిఖీలు చేస్తూ అవుతవుకులు ఉన్నట్లయితే ఆకస్మిక దాడులు నిర్వహించి అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికలలో ఓటర్లను పలువ పెట్టేందుకు బంగారం, నగదు, వెండి ఇతర వస్తువులు తనిఖీల్లో పట్టుబడినట్లైతే వెంటనే ఫ్లయింగ్ సర్వేలెన్సు్కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పి అడ్మిన్ కే నాగేశ్వరరావు, ఎస్సీబీ ఈఎస్ రవికుమార్, ఎస్సీబీ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అనుమతుల కోసం సువిధ యాప్ వినియోగించుకోండి

ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : రాజకీయ నాయకులు సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించుకునేందుకు అనుమతుల కోసం సువిధయాప్ ను వినియోగించు కోవాలని ఒంగోలు ఆర్డిఓ డివి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నందు విలేకరుల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, ఒంగోలు ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయ పార్టీల సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించుకునేందుకు అనుమతుల కోసం కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా నేరుగా సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో అందుకు కావలసిన దస్త్రాలు పొందు పరచాలన్నారు. ఒంగోలు నియోజక వర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఏదైనా వివరాలు కావాల్సి ఉంటే ఫోన్ నెంబర్ 08592 880 99 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కార్యాలయం ఏవో కృష్ణారావు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వేగేశన ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని మర్రిప్రోలువారిపాలెంకు చెందిన మున్నం చిన్న కొండలు రెడ్డి ఇల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ టీడీపీ,జనసేన, పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ తెలుగుదేశం నాయ కులుతో కలసి వెళ్లి భాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని 14గ్రామ పంచాయతీలలో భాగంగా మహిళలకు ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఏపీవో మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని, ఓటును సద్వినియోగం చేసుకోవాలని, నా ఒక్క ఓటుతో ఏమవుతుందనే నిర్లక్ష్యాన్ని వదిలి ప్రతి ఒక్క ఓటు స్వేచ్ఛగా వినియోగించు కోవాలని తెలియచెయటం జరిగింది. ఓటు యొక్క విలువను గురించి అవగాహన కల్పించటం జరిగినది. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పాండురంగ ప్రసాద్, టీఏలు, ఏఫ్ఏలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

15 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్ల లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 15 మంది మహిళలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లను నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్పీ బాలయ్య తెలిపారు. కొనకనమిట్ల మండలంతో పాటు పొదిలి మర్రిపూడి దొనకొండ కనిగిరి మండలాల నుంచి వచ్చిన మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరిగిందన్నారు ప్రభుత్వం వారికి అందిస్తున్న పారితోషకం త్వరలో వారు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ స్టాఫ్ నర్స్ బూదాల జ్యోతి వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి దేవస్థాన ముఖ ద్వార నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు వైజంక్షన్ సమీపంలో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయ స్వామి వారి దేవస్థానంకు ముఖద్వార నిర్మాణమునకు బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ భూమిపూజ కార్యక్రమం నిర్వహి ంచారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, తులసి శివనాగేశ్వరరావు, రంగిశెట్టి ఆంజనేయులు ఉన్నారు.

విశాలాంధ్ర

చంద్రన్నా...కొండయ్యకు టిక్కెట్టన్నా...

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రానున్న ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ టిక్కెట్ నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ మద్దులూరి మాల కొండయ్యకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. తెదేపా కార్యాలయంలో మోకాళ్ళపై నిలబడి కష్ట కాలంలో పార్టీకి అండగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసిన కొండయ్యనే అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. ప్రయోగాల పేరుతో కొత్త వారికి అవకాశం ఇవ్వద్దని మోకాళ్ళపై మోకరిల్లి వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌతరపు జనార్ధన్ రావు,గజవల్లి శ్రీనివాసరావు, మస్తాన్రావు, గంజి పురుషోత్తం పాల్గొన్నారు.

గోశాల నిర్మాణ భూమి పూజలో వెంకటేష్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాలలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నూతన గోశాల నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ వైకాపా అభ్యర్థి కరణం వెంకటేష్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కౌన్సిలర్లు, వైకాపా స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అసెస్మెంట్ క్యాంప్

విశాలాంధ్ర - వేమూరు : ఆంధ్రప్రదేశ్ సర్వ శిక్షణ అభియాన్ ఉత్తర్వులు మేరకు వేమూరు నియోజకవర్గంలోని విభిన్న ప్రతివావంతులైన చిన్నారులకు 22వ తేదీ శుక్రవారం జంపని జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి రోజ్ ల్యాండ్ తెలియజేశారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విభిన్న ప్రతిభావంతు లైన చిన్నారుల పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసె స్మెంట్ క్యాంపును సద్వినియోగపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర ఉన్న ఆవోపా కార్యాలయంలో ఉన్న వలివేటి మహాత్మా గాంధీ, లీలావతి ఆవోపా కంప్యూటర్ శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో వేసవిలో ఎం.ఎస్ ఆఫీస్, పేజ్ మేకర్,ఫోటో షాప్,టాలీ కోర్సులలో శిక్షణను ఇవ్వనున్నట్లు మాస్టర్ మొహిద్దిన్ తెలిపారు. బ్యాచ్‌కు 20 మంది చొప్పున 140 మందికి మాత్రమే ఈ అవకాశం ఉన్నట్లు తెలిపారు. శిక్షణానంతరం పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. వివరాల కోసం 9848242835, 9959598182లను సంప్రదించాలన్నారు.

చీరాల అభివృద్ధే లక్ష్యం : కరణం వెంకటేష్

విశాలాంధ్ర - చీరాల :

చీరాల అభివృద్ధే తన లక్ష్యమని,తన తండ్రిని ఆదరించినట్లే తనని ఆదరించాలని చీరాల ఎమ్మెల్యే అభ్యర్ధి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం దేవినూతల గ్రామంలో చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ పోలేరమ్మ గుడిలో పూజ కార్యక్రమంలో పాల్గొని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి,శాంతియుత వాతావరణం ఏర్పడేలా పనిచేశామన్నారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నన్ను నమ్మి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలని అందరం సమిష్టిగా కృషి చేసి నియోజకవర్గంలో వైస్సార్సీపి జెండా ఎగరేద్దామన్నారు. మీ బిడ్డలా వస్తున్నానని ప్రజలందరు ఆశీర్వదించి గెలిపించాలని,నాయకులు కార్యకర్తలు తమ పూర్తి సహకారం అందించాలని కోరారు.తన తండ్రి కరణం బలరామకృష్ణ మూర్తి దేవినూతల నుంచే ప్రచారం మొదలుపెట్టారని అదే సెంటిమెంట్‌గా ఇక్కడ నుంచే ప్రచారం మొదలుపెడుతున్నానన్నారు. నియోజకవర్గ ప్రజలు గత ప్రభుత్వ పాలన ఎలా ఉంది ఈ ప్రభుత్వ పాలన ఎలా ఉందో గమనించాలన్నారు.మీ అందరి సహకారంతో రాబోయే ఎన్నికలలో పోటీ చేస్తున్నానని, అందరు సహకరించి నా గెలుపుకు కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ పార్టీ అధ్యక్షులు ఆసాది అంకళ రెడ్డి,బొడ్డు సుబ్బారావు,కొండ్రు బాబ్జీ,చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీ వైష్ణవీ,రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత రాజశేఖర్,రాష్ట్ర యువజన అధ్యక్షుడు యాతం మేరీబాబు,రాష్ట్ర సేవదళ్ సెక్రటరీ గోలి గంగాధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు,జిల్లా వాణిజ్య అధ్యక్షులు చీమకుర్తి బాల కృష్ణ,జిల్లా కార్యదర్శి బండారు శివ పార్వతి,వైస్సార్సీపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. సూరారెడ్డిపాలెం గ్రామంలోని ప్రధాన వీధులలో ప్రజాస్వామ్యాన్ని నిర్మిద్దాం ఓటు హక్కును వినియోగిద్దాం అనే నినాదంతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ జిల్లా నీటి యాజమాన్య సంస్థ బి అర్జున్‌రావు, ఎంపీడీవో పి సుబ్రహ్మణ్యం, ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి వెంకటస్వామి, ఏపీవో సుభాషిణి డ్వామా ఎం ఈ మధుసూదన్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ బి అర్జున్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ముఖ్యంగా మొదటిసారి ఓటు వేయబోయే వారికి అవగాహన కల్పించి వారంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 100శాతం ఓట్లు పోలింగ్ జరిగేలా బిఎల్వోలు చూసుకోవాలని అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన ఓటు ప్రాధాన్యత గుర్తించి అందరూ ఓటు వేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో టిఏలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది వివోఏ, డిఆర్‌డిఏ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బేతని కాలనీలో ఎస్వీఈపి ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ వై.పి.రెడ్డి వికలాంగులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు.రానున్న ఎన్నికలలో ఓటుకు ఉన్న ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై ఉన్న ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుందని నోడల్ ఆఫీసర్ ఫర్ పీడబ్ల్యుడి ఆర్.గుణశీల అన్నారు.

ఆర్యవైశ్య సోదరుల ఆత్మీయ సమావేశంలో 'ముత్తుముల'

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని డిఆర్ఆర్ ప్లాజా సమీపంలోని వాసవి నగర్‌లో ఆర్యవైశ్య సోదరులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి మరియు వారి సతీమణి పుష్పలీల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గతంలో తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, పట్టణంలో త్రాగునీటి సమస్యను పరిష్కారం చేశానని గుర్తు చేశారు. ఆర్యవైశ్య సోదరులంతా స్థానికంగా నివాసం ఉండే తనకు మద్దతుగా నిలిచి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు సచివాలయ కన్వీనర్ వాడకట్టు రామాంజనేయులు 250 మంది ఆర్యవైశ్య సోదరులతో సహ వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్య సోదరులంతా కలిసికట్టుగా పనిచేసి గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌రెడ్డిని గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వందలాది మంది ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు గొడుగులు అందజేత

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరిలోని చింతలపాలెం అంగన్వాడీ కేంద్రములో బుధవారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు గొడుగులు అందజేయడం జరిగింది. గ్రంధి శ్రీకాంత్, లక్ష్మి ప్రణవి దంపతుల కుమారుడు వెంకట సాయి సూర్య నికేతన్ లు 30 మంది అంగన్వాడీ చిన్న పిల్లలకు గొడుగులు మరియు స్వీట్లు పంపిణీ చేశారు. వాగిచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతేడాది సుమారు 300 మంది అంగన్వాడీ పిల్లలకు గొడుగులు పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి అరుణోదర్, కార్యదర్శి ఉమాకాంత్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ దేవస్థానంలో 'దద్దాల' పూజలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో వెలసిన శ్రీ అంకాలమ్మ దేవస్థానం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైసీపీ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించి కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, మండల ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించాలని ఆ దేవిని ప్రార్థించినట్లు దద్దాల నారాయణ తెలిపారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, కనిగిరి ఏఎంసీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మరియు వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ కస్తాల బాలాజీ, నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి, సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, మద్ది తిరుపతయ్య, ఆది నారాయణరెడ్డి, సర్పంచ్ కత్తి రాజారావు, గురుప్రసాదు, వెంకీ మరియు లింగంగుంట్ల గ్రామస్తులు వేములపాడు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర-వెలిగండ్ల :

మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పని ద్వారా పని లేని కాలానికి ప్రభుత్వం కల్పిస్తున్న పనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకొని ఉపాధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ పి.వి శేషయ్య, సహాయకురాలు స్వప్న పాల్గొన్నారు.

మతతత్వ పార్టీలను ఓడించాలి

- ఎన్‌డిఏ వద్దు.. ఇండియా ముద్దు...

-మేలుకో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్లు రమేష్

విశాలాంధ్ర-ఒంగోలు: పట్నాయక్, పల్లి థామస్ ముఖ్య అతిథులుగా కొండ్రు శిరీష ఆధ్వర్యంలో ఒంగోలు లోనీ ప్రెస్‌క్లబ్‌లో మేలుకో ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మహిళలూ పాల్గొన్నారు. మేలుకో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ పల్లి థామస్ వివరిస్తూ ఎద్దెలు కర్ణాటక (మేలుకో కర్ణాటక) ప్రచార ఫలితంగా అక్కడ మతతత్వ పార్టీలను ఓడించడంలో విజయం సాధించిందని, అదే తరహాలో జాగో తెలంగాణలో కూడా బీజేపీనీ ఓడించడంలోప్రధాన పాత్ర పోషించిందని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ లో కూడా మతతత్వ పార్టీలకూ, మద్దతు తెలుపుతున్న పార్టీలను ఓడించి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ మన ఓటు ఎటువంటి వ్యక్తికి వేస్తున్నాము, ఆ అభ్యర్థి ఎటువంటి వాడు భవిష్యత్తులో గెలిచిన తరువాత పార్టీ మారకుండా ప్రజల పక్షాన నిలబడగలడ ఆలోచించాలి. మనమంతా బీజేపీ పార్లమెంట్ స్థానాలను ఓడించగలిగితే, మోడీ ప్రభుత్వం దిగివస్తుందని, తద్వారా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గుతాయని అన్నారు. కేంద్రంతో ఢీ కొట్టాలంటే అన్ని సామాజిక వర్గాలు,ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి కట్టుగా పని చేయాలనీ అన్నారు, ఈ కార్యక్రమంలో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, కట్టవర ప్రసాద్, వెంకటేశ్వర్లు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్రనాయకులు జార్జి, నర్సింగరావు, ఏస్ డీ పీ ఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, గుత్తి కోటేశ్వరరావు, ప్రజా స్వామ్య పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, రెడ్‌స్టార్ నాయకులు బి, సుబ్బారావు మహిళలూ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కన్వీనర్ గుత్తి కోటేశ్వరరావు పుస్తక అవిష్కరణ చేశారు.

ఉజ్వల భవితకు చదువే పూలబాట

- శ్రీ గౌతమీ విద్యా సంస్థల డైరెక్టర్ నాగేంద్రబాబు

విశాలాంధ్ర-దొనకొండ: విద్యార్థుల ఉజ్వల భవితకు చదువే ప్రధాన పూలబాట అవుతుందని శ్రీ గౌతమీ విద్యా సంస్థల డైరెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు. స్థానిక శ్రీ గౌతమీ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన 2021-24 బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిగ్రీలో కష్టపడి మంచి ఫలితాలు సాధించిన వారు ఉజ్వల భవిష్యత్ వైపు అడుగులు వేస్తారని, సమయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదివి పరీక్షలు రాయాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలను అందజేశారు. ముందుగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపి, అడ్మిన్ నాని, అధ్యాపకులు రమేష్, వెంకటేశ్వరరెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల అమలులో అలసత్వం

విశాలాంధ్ర-కొల్లూరు : ఎన్నికల నిబంధనల అమలులో అధికారుల అలత్వం కొట్టొచ్చినట్లు కానవస్తుంది. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ప్లెక్సీలు, రాజకీయ నాయకుల చిత్రపటాలతో కూడిన శిలఫలకాలు కనిపించకుండా చేపట్టవలసిన చర్యలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. స్వచ్ఛందంగా రాజకీయ నాయకులు తొలగించాల్సిన ప్లెక్సీలను తొలగించకుండా వదిలేయడంతోపాటు, అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్‌తో కూడిన చిత్ర పటాలు కనిపించకుండా చర్యలు చేపట్టవలసిన అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్షణం అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరతున్నారు.

అవినీతి జగన్‌పై ప్రజా సైనికుల యుద్ధం

- ప్రజాగళం సభకు సైన్యంవలే పోటెత్తిన ప్రజలు

- రాష్ట్ర పునర్నిర్మాణానికి టీడీపీ,జనసేన,బీజేపీ పొత్తులు

- ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర - రేపల్లె : అవినీతి జగన్ పాలనపై ప్రజా సైనికులు యుద్ధం చేసేలా ప్రజాగళం సభ విజయవంతమైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభకు వచ్చిన జన సందోహన్ని చూస్తే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందన్నారు.అరాచక జగన్మోహన్ రెడ్డి పాలనపై యుద్ధం చేయడానికి వచ్చిన అఖండ సైనికుల వలె ప్రజలు తరలివచ్చారని తెలిపారు. టీడీపీ, జనసేన,బీజేపీ పార్టీలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడంతో సభ విజయ వంతమైందన్నారు. పోలీసుల వైఫల్యంతో జాతీయ రహదారిపై ఇరువైపులా 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఇబ్బందులు గురయ్యారని,అనేక మంది కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ సభా వేదికకు వచ్చారని వివరించారు. 15 సంవత్సరాల తర్వాత లారీలపై, ట్రాక్టర్ల పై ప్రజలు సభలకు రావడం చూశానన్నారు.సిద్ధం సభల పేరుతో అధికార పార్టీ ప్రజలను బెదిరించి వాలంటీర్లు సహకారంతో సంక్షేమ పథకాలు ఆపేస్తామని, పింఛన్లు నిలిపేస్తామని, నివేసిన స్థలాలు పొందిన లబ్ధిదారుల పట్టాలను రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడి జనాన్ని తరలించారని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్రంలో టీడీపీ,జనసేన,బిజెపి పార్టీలు పొత్తులు పెట్టుకున్నాయని వివరించారు. 30 సంవత్సరాల పాటు రాజకీయాలకు దూరంగా ఉండి, తర్వాత గెలిచిన నాయకుడు పొత్తులపై మాట్లాడటం సిగ్గుచేటని అంబటి రాంబాబు పై చురక లాంటించారు.కుటుంబాలలో చిన్న చిన్న విభేదాలు వస్తే పరిష్కరించుకుంటామని,ఆనాడు సిద్ధాంతపరంగా చిన్నచిన్న అభిప్రాయ బేధాలు రావడంతో విడిపోయామని నేడు రాష్ట్ర పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని అవినీతి పాలనను అంతమొందించేందుకు మూడు పార్టీలు ఓకే అజెండాతో రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసామన్నారు. 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెట్టినప్పుడు జగన్మోహన్ రెడ్డిని ఆయన తల్లిని దూషించిన వారికి,నేడు మంత్రివర్గంలో పదవులు ఇచ్చి పార్టీలో చేర్చుకోలేదా అని విమర్శించారు.అభివృద్ధిలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనుకబడిందని రాష్ట్ర పునర్ నిర్మాణం చేపట్టేందుకు పొత్తులు పెట్టుకున్నామన్నారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని దోచేశారని విమర్శించారు. ప్రజాహితం కోసం పాటుపడుతున్న చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి అభ్యర్థులను గెలిపించి,సైకో పాలనను తుదముట్టించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పంతాన్ని మురళీధర్ రావు, వెనిగల్ల సుబ్రమణ్యం, టీడీపీ, రైతు నాయకులు మేక శివరామకృష్ణ, ధర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను అమలు చేయాలి

ప్రజాసంఘాల ఐక్య వేదిక,ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలు ఎంతో కీలకమని ఏపీకి ప్రత్యేక హోదా,విభజన జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆనాటి హామీలను అమలు చేయాలని ప్రజలు ప్రశ్నించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక,ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.పట్టణంలోని ఎన్జీ హోమ్ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసంఘాల ఐక్య వేదిక పక్షాన ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ,విభజన హామీల పట్ల ప్రజల్లో తిరిగి చర్చించుటకు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలందరూ రాజకీయ పార్టీలతీతంగా చర్చించి ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ ఎన్నికలు ఎంతో కీలకమని ఈనేపథ్యంలో వైసీపీ,టీడీపీ,పాలక పార్టీలు సీపీఐ,సీపీఎం,జనసేన,బిజెపి వంటి ప్రతిపక్ష పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని ఏపీకి ప్రత్యేక విభజన హామీలు అమలు గురించి ప్రజలు విస్తృతంగా చర్చించాలని కోట వెంకటేశ్వర రెడ్డి కోరారు. అదేవిధంగా ప్రజాస్వామ్యానికి పంచ ప్రమాదాలైన ధనము కులము, మతము, మద్యం,నేరస్థ రాజకీయాల ఉచ్చులో ఓటర్లు పడవద్దని వెంకటేశ్వర రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగా తెలుగువీర లేవరా దీక్ష బూని సాగరా అనే దేశభక్తి గేయాన్ని ఆలపించారు.ఈ సమావేశంలో బాపట్ల ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యదర్శి ఫోరం ఫర్ బెటర్ బాపట్ల డాక్టర్ పిసి సాయి బాబు,బండి కళ్ళ బాబు రావు,ఆట్ల బాలాజీ రెడ్డి,డివి రమణయ్య,కే. శివశంకర్, సుగంధరావ్ శీలం మల్లికార్జున రెడ్డి, నిర్మలమ్మ, మహాలక్ష్మి, ఏ.కళ్యాణి,దాసరి లక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని బేతపూడి గ్రామంలోని రెడ్డి సామజిక వర్గానికి చెందిన 20మంది వైసీపీ నాయకులు,కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ బాపట్ల మండల మాజీ అధ్యక్షులు కావూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ,జనసేన,బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారిలో కోట గాంధీ రెడ్డి, నాయుడు సాహెబ్ రెడ్డి,నాయుడు అర్జున్ రెడ్డి, కుంచాల సుబ్బారెడ్డి,నాయుడు పానకాల రెడ్డి, భోగి రెడ్డి తిరుపతి రెడ్డి, నాయుడు శ్రీనివాస్ రెడ్డి,కోటా సురేష్, కోటా శ్రీనివాసరెడ్డి పార్టీలోక తదితరులు చేరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కాముల సాంబశివ రావు, ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబయ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు నాయుడు శ్రీనివాస్ రెడ్డి,కోట సాయిబు రెడ్డి,కోట పుల్లా రెడ్డి,నాయుడు కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు సమీపంలో మంగళవారం వెలుగు చూసింది. వివరాల్లోకెళితే ఒంగోలు - చీరాల జాతీయ రహదారిలో ఉప్పుగుండూరు సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఒంగోలు నుండి చీరాలవైపు వెళ్తున్న ఓ లారీ,ఎదురుగా వస్తున్న కారు రెండు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నాగులుప్పలపాడు ఎస్సై బ్రహ్మనాయుడు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. ముందుగా క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు.అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి గల కారణాలపై ఎస్సై బ్రహ్మనాయుడు ఆరా తీస్తున్నారు.ఈ ఘటనలో మద్రిపూడి మండలం గుండ్ల సముద్రం గ్రామానికి చెందిన కోవెలకుంట్ల శివ కృష్ణ (33) తండ్రి చౌడయ్య అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్లో-బోర్డులు తొలగించరూ..

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మున్సిపల్ కార్యాలయం పరిధిలోని అనుమతి పొందిన గ్లో-బోర్డులను తొలగించలేదని నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యా లయం పరిధిలోని వాణిజ్య, వ్యాపార పరిధిలో 167 గ్లో-బోర్డులు మాత్రమే అనుమతి పొందాయన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొ రేషన్ చట్టం 1955 సెక్షన్ 622(2), 420, 421 ప్రకారం మున్సిపల్ కార్యాలయం నుంచి లేదా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 63, జీవో 326 ప్రకారం వ్యాపార నిమిత్తం మాత్రమే గ్లో-బోర్డులు, వాల్ పెయింట్‌లు అనుమతించ బడతాయన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా ఏమైనా గ్లో-బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోనదలచిన వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి రాతపూర్వకంగా అనుమతి పొందాలన్నారు.

గడపగడపకు చేరిన సంక్షేమ పథకాలు

-కనిగిరి వైసీపీ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు గడపగడపకు చేరాయని కనిగిరి వైసీపీ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. బుధవారం హనుమంతునిపాడు మండల పరిధిలోని వేములపాడు సచివాలయం లింగంగుంట్ల సచివాలయాల పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు ప్రతిగడపకు చేరాయని అన్నారు. అలానే ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో సంక్షేమ పరిపాలన ఐదు సంవత్సరాలు కొనసాగిందన్నారు. తిరిగి ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని దద్దాల నారాయణ అన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి,మండల పార్టీ అధ్యక్షు లు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ భవ నం కృష్ణారెడ్డి, కనిగిరి మార్కెట్ యార్డు డైరెక్టర్ మరియు వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ కస్తాల బాలాజీ, సర్పంచ్ సానికొమ్ము, మధుసూదన్ రెడ్డి, నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి, ఆదినారాయణరెడ్డి,గురు ప్రసాద్, సాంబిరెడ్డి,సర్పంచ్ కత్తి రాజారావు,ఉప సర్పంచ్ వెంకటరెడ్డి,మద్ది తిరుపతయ్య, సచివాలయ కన్వీనర్లు,గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విడదల రజినీ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ స్పందించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర మంత్రి విడదల రజిని సీటు కోసం డబ్బులు తీసుకుం దంటూ సొంత పార్టీ నేత ఆరోపించడం బోగస్ ఓట్లు చేర్పించడానికి ప్రయత్నించి అబాసు పాలు కావటం, పాస్టర్లకు కానుకలు పంపిణీ చేయడం వంటి వివాదాస్పద విడదల వ్యవహారశైలిపై తక్షణం ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సీనియర్ టీడీపీ బీసీ నాయకులు డాక్టర్ నిమ్మల శేషయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రజిని ఎన్ని కుయుక్తులు పన్నినా ఘోర ఓటమి పాలవడం తధ్యం అన్నారు. చిలకలూరిపేటలో మంత్రి దందాలను చూసి పశ్చిమ వాసులు విడుదల రజనీకి ఓటుతో బుద్ధి చెప్పడం తధ్యమన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన నేతలపై దాడులు

పత్తిపాడు నియోజకవర్గంలో ఓటమి భయంతోనే వైసీపీ అభ్యర్థి తన అనుచరులతో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు పై దాడులకు ప్రోత్సహిస్తున్నారని, అలాగే తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామ జనసేన నేతపై వైసీపీ శ్రేణులు దాడి చేయడం దారుణమని నిమ్మల శేషయ్య ఆరోపించారు.

శివయ్యను పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని మంచికలపూడి గ్రామంలో నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి యార్లగడ్డ శివయ్యకు కంటి శుక్లాం తీసినందున బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటే శ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొని శివయ్య పరామర్శించారు.

రామాంజనేయులుపై దాడి పిరికిపంద చర్య

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనే యులు పై వైసీపీ నేతలు చేసిన దాడి ఒక పిరికిపంద చర్య అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర (నానీ) పేర్కొన్నారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వా మ్యంలో దాడులు ఏ మాత్రం సహేతుకం కాదని ఆయన హితవు పలికారు. రామాంజనే యులు పై దాడి చేశారని ఇది ఏ మాత్రం మంచిది కాదని కోవెలమూడి రవీంద్ర హితవు పలికారు.

కృష్ణమాదిగపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

విశాలాంధ్ర-టంగుటూరు : వైయస్సార్సీపి ఎస్సీ సెల్ నాయకులు చెరుకూరి కిరణ్ మంద కృష్ణ మాదిగపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మహజన్ సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు తొరిటి ఆనంద్ మాదిగ ఖండించారు. స్థానిక జున్ను బేకరీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తురిటీ ఆనంద్ మాదిగ వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ నాయకులు చెరుకూరి కిరణ్‌కు మంద కృష్ణ మాదిగను విమర్శించే స్థాయి నీది కాదు అని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఉద్యమ చరిత్ర అంత వయసు నీకు లేదు అన్నారు. సమాజంలో మాదిగ అని సగర్వంగా చెప్పుకోకలుగుతున్నాం అంటే కారణం మంద కృష్ణ మాదిగ వలనే అని ఎద్దేవా చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసమే ఎమ్మార్పీఎస్ మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడింది అయినప్పటికీ ఆరోగ్యశ్రీ, వృద్ధులకు పెన్షన్, ఎస్సీ ఉద్యోగుల రిజర్వేషన్లు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలను కాపాడిన చరిత్ర మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ గురించి మీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి చేత ప్రకటన చేయించే దమ్ము ధైర్యం నీకుందా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేలు మంత్రులకు మీ నాయకుడిని కలిసే స్థాయి లేదు అలాంటిది నీ ఉంటుందా అని ఎద్దేవా చేశారు. ఈ సమాజం మొత్తానికి సామాజిక న్యాయం చేయించిన చరిత్ర ఎమ్మార్పీఎస్ ది అని గుర్తుంచుకోవాలని అన్నారు. 2000 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేయడం వలన దాదాపుగా మాదిగలు 2004-24 వేల మంది అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. అలాంటి చంద్రబాబు నాయుడుకు మందా కృష్ణ మాదిగ మద్దతిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. తదనంతరం 2014లో కొన్ని అనివార్య కారణాలవల్ల చంద్రబాబునాయుడు మాట తప్పడు అన్నారు. లక్షలాది మాదిగలు పాల్గొన్న సమావేశంలో దేశ ప్రధాని తీసుకురావడం ఒక మంద కృష్ణ మాదిగకే ఆ ఘనత తగ్గుతుందన్నారు. ఇప్పటికైనా పార్టీలకు ఊడిగం చేయడం మానుకొని మాదిగ జాతి అభివృద్ధి కోసం పాటుపడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జలదంగి నరసింహారావు మాదిగ, నేలపాటి రాజ్ మాదిగ, వరల దేవదాసు మాదిగ, పూనూరి క్రిస్టఫర్ మాదిగ, రేణమాల సుదర్శన్ మాదిగ చుండి నరసింహారావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సర్వమత సమానత్వం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

విశాలాంధ్ర-గుంటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని మతాలకు సమాన ఆదరణ లభిస్తోందని, రాజ్యాంగం నిర్దేశించిన విధంగా సర్వమత సమానత్వం పరిఢవిల్లుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైసీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. నగరంలోని 20వ డివిజన్ సంపత్‌నగర్, రామచంద్రా పురం కాలనీలో రామాలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రజిని మాట్లాడుతూ జగనన్న పాలనలో హిందూ మతంలో అర్చకులకు, క్రైస్తవ మతంలో పాస్టర్లకు, ఇస్లాం మతంలో మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ దుర్గ గుడిలో కోట్లాది రూపా యలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, చంద్రబాబు హయాంలో కూల్చివేసిన అనేక ఆలయాలను పునర్నిర్మాణం చేశారని చెప్పారు.

అభివృద్ధి ప్రతిపక్షాలకు కనపడడం లేదా?

నగరంలో సంపత్ నగర్, ఆర్.అగ్రహారంలో పలు ప్రధాన రహదారులను విస్తరించి, అత్యంత నాణ్యతతో నిర్మాణం చేశామని, వీటితో పాటు పశ్చిమ నియోజక వర్గంలో బ్రాడీపేట, కోబాల్డ్‌పేట, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో రహదారులను నిర్మాణం చేశామన్నారు. వైసీపీ నాయకుడు కావటి ఉదయ చంద్ర విక్రమ్ నాయుడు, 20వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు కంతేటి శ్యామ్ శేఖర్, బాలకృష్ణ, వీరయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - మార్టూరు : మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి ఎడం బాలాజీ తనయుడు ఎడం దీపక్ జడ్పీటీసీ సుజ్ఞానమ్మ హాజరై ప్రారంభించారు. దీపక్ జన్మదిన పురస్కరించుకొని మండల నూతన కార్యాలయంలో కేక్ కట్ చేసి దీపక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, మార్టూరు మండల అధ్యక్షుడు బాబు నాయక్, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కలేశ వలి, సన్నీ, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ సెక్రెటరీ గడ్డం మస్తాన్ వలీ,మార్టూరు గ్రామ సర్పంచ్ రాజా నాయక్,మార్టూరు గ్రామ ఉప సర్పంచ్ రామారావ్,మార్టూరు మండల ఎస్సీ సెల్ కన్వనర్ అట్లూరి సుగుంద రావు, మైల చిన్న నాగేశ్వరరావు, మార్టూరు మండల సీనియర్ నాయకులు షేక్ సులేమాన్, రషీద్, జై పల్, గాంధీ,కాండ మస్తాన్,సుబ్బయ్య, బండి బాబు,వలి,జానీ బాషా,డాన్ మస్తాన్, చాన్ భాష, సకల ఆంజనేయులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ బూత్ కన్వీనర్ టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-పెదకాకాని : మండలం లోని పెదకాకాని గ్రామం ముస్లీం పాలెం సచివాలయం-5కు చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ షేక్ అలీ మోర్తాజా బుధవారం చింతలపూడి గ్రామంలో పొన్నూరు నియోజ కవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అలీ మోర్తాజా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపుకు శక్తివంచన లేకుండా పనిచేసి భారీ మెజార్టీతో గెలిచే విధంగా తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, పెండ్యాల నాగసురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను చరమ గీతం పాడాలి

విశాలాంధ్ర-గుంటూరు : జగన్ రాక్షస పాలన మళ్లీ రాకూడదన్న దృఢ నిశ్చయంతో ప్రజలున్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. అర్బన్ పార్టీ కార్యాలయంలో బుధ వారం విలేకర్లతో ప్రభాకర్ మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారని, టీడీపీ, జనసేన, బీజేపీ కూట మి అధికారం లోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసీపీని ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తును రద్దు చేసి, గొడ్డలి గుర్తు కేటాయించాలన్నారు. 5 ఏళ్లలో 600 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు హత్యకు గురయ్యారని తెలి పారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన వారి నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకు న్నారన్నారు. ఇటువంటి నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

పిడుగురాళ్ల మాధవి గెలుపునకు కృషి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి గెలుపుకు తెలుగుయువత విభాగం సైనికుల మాదిరిగా నిర్విరామ కృషి చేసి చారిత్రక విజయాన్ని అందిస్తాం అని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ తెలిపారు. గుంటూరు పశ్చిమ ఎన్నికల కార్యాలయం జీటీ రోడ్డు నందు ప్రారంభోత్సవం సందర్భంగా సాయి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి మాధవి విజయాన్ని కాంక్షిస్తూ సైకిల్ గుర్తుతో కూడిన జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు షేక్ ఫిరోజ్, మన్నెం శ్రీనివాసరావు, పూసల శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ముస్లీం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియామకం

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆశ్శీస్సులతో గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా తెనాలి పట్టణ 5వ వార్డు నందులపేటకు చెందిన షేక్ చాన్‌బాషాను నియమించినందున అతను సంతోషదాయకంగా తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌ను బుధ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కార్యదర్శిగా నియమిం చడం హర్షనీయమని ఇందుకు సహకరించిన తెనాలి నియోజకవర్గ కార్యవర్గ సభ్యులకు శాసనసభ్యునకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు కౌన్సిలర్, పెచ్చింగ్, సుభాని, రహీం, స్వర్ణకార సంఘనాయకులు, ముస్లీం సోదరులు తదితరులు అభినందనలు తెలిపారు.

చెవిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏడుకొండలు

విశాలాంధ్ర–కొనకనమిట్ల : ఒంగోలు పార్లమెంటరీ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మార్కాపురంలో బుధవారం జడ్పీటీసీ సభ్యుడు అక్కి దాసరి ఏడుకొండలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తమ విజయం కోసం కృషి చేస్తామని అన్నారు. ఏడుకొండలుతో పాటు మండల వైసీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద్ద వెంకటరెడ్డి నాయకులు మండల శ్రీను తదితరులు ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- డీఎస్పీ బాలసుందర్రావు

విశాలాంధ్ర–మార్కాపురం : మే 13వ తేది జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని మార్కాపురం డిఎస్పీ బాల సుందర్‌రావు కోరారు. బుధవారం మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామం నందు కేంద్ర, రాష్ట్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఎవరికి వారు స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకొనే వాతావరణం కల్పిస్తామన్నారు. వివాదాలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ప్రజల సహకారం ఉంటే ఎన్నికలు సమర్ధవంతంగా జరుగుతాయన్నారు. గ్రామంలో వర్గవిభేదాలు లేకుండా మీకు నచ్చిన ఓటు వేసుకోవాలన్నారు. పట్టింపులకు వెళ్లకుండా ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సర్కిల్ ఇనిస్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా పథకాలపై అవగాహన

విశాలాంధ్ర – వేటపాలెం : జనంలోకి మనం కార్యక్రమంలో భాగంగా సరస్వతి నికేతనంలో బుధవారం పోస్టల్ ఉద్యోగాలు ర్యాలీ తపాలా పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక పోస్ట్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో తపాల శాఖ ప్రజలకు అందజేస్తున్న వివిధ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. సాయంత్రం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. వివిధ పథకాలు పోస్టల్ బీమా వంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు . అనంతరం తపాల సేవలు సమ్మిళిత కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ ఐ. శివరామకృష్ణ, వేటపాలెం ఎస్పీఎం షేక్ రేష్మ, పల్లపోతు వెంకటేశ్వర్లు, బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ములకల గంగాధరరావు, చిన్న మొత్తాల పొదుపు ఏజెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

కోడి పందెం నిర్వాహకులు అరెస్టు

విశాలాంధ్ర–టంగుటూరు : కోడి పందెం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను టంగుటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టంగుటూరు ఎస్సై ఏ నాగేశ్వరరావు కథనం మేరకు మండలంలోని కొణిజేడు గ్రామంలో కోడి పందెం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి కోడిని, 2500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలు పేరుతో నట్టేట ముంచిన జగన్

- శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎం షరీఫ్

విశాలాంధ్ర – పిట్టలవానిపాలెం : నవరత్నాల పేరిట రాష్ట్రంలోని ప్రజలను సీఎం జగన్మోహన్‌రెడ్డి నట్టేట ముంచారని శాసనమండలి మాజీ చైర్మన్ ఎం.ఎం షరీఫ్ ఆరోపించారు. చందోలులోని నియాజీ గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఆగడాలు గత ప్రభుత్వంలో ఏనాడు జరగలేదన్నారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని చంద్రబాబును అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 40 సంవత్సరాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండి ప్రతి ముఖ్యమంత్రి పాలన చూశానని జగన్ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు ఎప్పుడూ జరగలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత స్వచ్ఛమైన రాజకీయాలకు ప్రజా ప్రయోజన రాజకీయాలకు అర్థాలు మార్చేశాడన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి అని ప్రజలను అడిగి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారన్నారు. నేడు రాజధాని లేని రాష్ట్రంగా నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ఏవీ కూడా రాష్ట్రానికి రాని పరిస్థితి నెలకొందన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రానికి రాజధాని ఏర్పాటు చేసి భవన సముదాయాల నిర్మాణం జరిగి అభివృద్ధి సాగుతున్న తరుణంలో సీఎం జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో జరిగే అభివృద్ధి అంతా వెనక్కి తీసుకువెళ్లారన్నారు. నాటి టీడీపీ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు 70 శాతం పూర్తి జరిగితే వైసీపీ పాలనలో కాలయాపన చేశాడే గానీ ప్రాజెక్టు పూర్తి జరగలేదన్నారు. సీఎం జగన్ అరాచక పాలనకు రాష్ట్రానికి కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాకపోగా ఉన్న కంపెనీలు పరిశ్రములు బెదిరింపులకు భయపడి మూత వేసుకుని వెనక్కి వెళ్లిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న సహజ సిద్ధ వనరులను ప్రజల ఆస్తులను, కష్టార్జితాన్ని దోచుకుంటూ మనకు అతి తక్కువగా పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో రైతు వ్యవసాయ రంగం సస్యశ్యామలంగా ఉండేదని నేడు పంటలు పండించే రైతు అన్నీ విధాలుగా దగాకు గురవుతున్నారన్నారు. టీడీపీ నాయకులు మీద పదుల సంఖ్యలో కేసులు నమోదు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ఆదాయం జగన్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలకే సరిపోతుందని కేంద్ర సహకారం మన రాష్ట్రానికి తప్పక అవసరం అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి ,పోలవరం పూర్తి, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిలుపుకోవాలంటే కేంద్రంలో ఉన్న బీజేపీ సహకారం అవసరం అన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం భవిష్యత్తు తరాల ఉన్నతి కోసం చంద్రబాబు, పవన్, బీజేపీ రానున్న ఎన్నికల్లో బరిలో నిలవబోతు న్నారని గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు. బాపట్ల నియోజ కవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, జనసేన సమన్వయకర్త నామన శ్రీమన్నారాయణ, కళ్లం హరినాధరెడ్డి తదితరులున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

విశాలాంధ్ర–హనుమంతునిపాడు : మండల పరిధిలోని హాజీపురం గ్రామంలో బుధవారం ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించారు. గతంలో ఎన్నికల సమయంలో ఘర్షణలు చోటు చేసుకున్న గ్రామాలలో నిఘా ఉంటుందని ఎస్సై శివ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తారని ఓటర్లు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు. అలానే వాట్సప్ గ్రూపులలో రాజకీయాల గురించి వ్యతిరేకంగా విమర్శిస్తే ఆ వాట్సప్ అడ్మిన్ లను ,సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రలకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై. పి.శివ నాగరాజు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెవిరెడ్డి,రాంబాబులకు సన్మానం

విశాలాంధ్ర–మార్కాపురం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి భాస్కర్‌రెడ్డి, మార్కాపురం, వై పాలెం నియోజకవర్గ ఎమ్మెల్యేల అభ్యర్థులు అన్నా రాంబాబు, టి. చంద్ర శేఖర్ల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం సెవెన్ హిల్స్ కల్యాణ మండపంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి, రాంబాబులకు గజ పూలమాలలు వేసి స్వాగతం పలికిన రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, రాష్ట్ర బీసీ బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎల్పి యాదవ్, డాక్టర్ సయ్యద్ మక్బూల్ భాషలు ఉన్నారు.

వైసీపీ నాయకుడు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర–పామూరు : మండలంలోని చట్టుమడుగు 4వ వార్డు మెంబెర్ కాలేబు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఒంగోలు వెంకటరమణ హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతు న్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ ఐ నాయకులు 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని గంధం ఇజ్రాయిల్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి మాట్లాడుతూ కాలేబు ఆరోగ్యం బాగుపడి స్వగ్రామానికి తిరిగి రావాలని, కాలేబు కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, మిరియం రామారావు, కేతు రమేష్‌రెడ్డి, కోడూరి రామసుబ్బారెడ్డి, బద్దిపూడి దానం, తిమోతి,బద్దిపూడి జార్జ్, బద్దిపూడి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత అంబటికి మాతృవియోగం

విశాలాంధ్ర–పామూరు : మండల వైసీపీ నాయకుడు అంబటి కొండారెడ్డి మాతృమూర్తి కాంతమ్మ మృతి చెందినది. బుధవారం పట్టణంలోని హిందూ స్మశన వాటికలో అంత్య క్రియలు జరిగాయి. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, వైసీపీ మండల యువజన అధ్యక్షులు, పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్, వెలి గండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్ భాషా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడ రాంబాబు, గట్ల విజయభాస్కర్ రెడ్డి, తదితరులు కాంతమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.